

# ఏ ఫంక్షన్‌కు వెళ్లినా స్టీల్ ప్లేట్, గ్లాస్ తీసుకెళ్లాల్సిందే..

నంద్యాల: జిల్లాకు చెందిన న్యాయవాది గరుడాద్రి సుదర్శన్ ఆలోచనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన చాలా కాలంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిరసిస్తూ వినూత్నంగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఏ శుభకార్యానికి వెళ్లినా తన వెంట స్టీల్ ప్లేట్, గ్లాస్ తీసుకువెళ్లి వాటినే ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, అందరూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిస్తున్నారు. ఆయన చేస్తున్న ఈ పనికి ఎందరో ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆయనో లాయర్.. ఏ ఫంక్షన్‌కు వెళ్లినా సరే వెంట స్టీల్ ప్లేట్, స్టీల్ గ్లాస్ తీసుకెళ్లడం అలవాటు. ఇదేం విచిత్రం అనుకుంటున్నారా.. అవును ఆయన ఎన్నో ఏళ్లుగా ఇలానే చేస్తున్నారు. ఏ శుభకార్యానికి, కార్యక్రమానికి వెళ్లినా వెంట స్టీల్ ప్లేట్, స్టీల్ గ్లాస్ తీసుకెళతారు. ఆయనకు జీవితంలో ఒక అలవాటుగా మారింది.. దీని వెనుక మంచి కారణం కూడా ఉంది. అదేంటో తెలిస్తే ప్రతి ఒక్కరు

నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన గరుడాద్రి సుదర్శన్ వృత్తిరీత్యా లాయర్. ఆయన ఏ ఫంక్షన్‌కు వెళ్లినా.. వెంట స్టీల్ ప్లేట్, స్టీల్ గ్లాస్ తీసుకెళ్లి.. ప్లేట్‌లో విందు భోజనం, గ్లాస్‌లో నీళ్లు తాగడానికి వీటిని ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ మాయలో పడిన నేటి కాలంలో ఈ మార్పు చాలా అవసరం అంటున్నారు. అందుకే ఇలా స్టీల్ ప్లేట్, గ్లాస్‌తో వెళుతున్నారు. అక్కడ తన స్టీల్ ప్లేట్‌లోనే భోజనాన్ని పెట్టించుకుంటారు. అంతేకాదండోయ్ ఆయన టీ తాగడానికి బయటకు వెళ్లినా సరే.. తన వెంట తీసుకెళ్లే స్టీల్ టీ గ్లాస్ ఉపయోగిస్తారట.

సుదర్శన్ అలా స్టీల్ ప్లేట్, గ్లాస్‌తో ఫంక్షన్‌లో కనిపించగానే కొందరు ఆశ్చర్యంగా చూసిన సందర్భాలు కూడా ఉన్నాయట. ఎవరు ఏమన్నుకున్నా పర్లేదని.. తాను మాత్రం ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకం అంటున్నారు. ప్లాస్టిక్ మనం తినే ఆహారం ద్వారా శరీరంలోకి వెళితే చాలా ప్రమాదమని చెబుతున్నారు. ఇలా ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ఓ ఉద్యమాన్ని చేపట్టారు.. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని చెప్పకనే చెబుతున్నారు. ఈయన కదా నిజమైన పర్యావరణ ప్రేమికుడు అంటూ అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. పాత రోజుల్లో ఏ ఫంక్షన్ నిర్వహించినా స్టీల్ ప్లేట్, స్టీల్ గ్లాస్ ఉపయోగించేవారు. కానీ కాలం మారింది.. ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాస్‌లు వచ్చాయి. వాటిలోనే శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల్లో భోజనాలు వడ్డిస్తున్నారు. ప్రస్తుతం కొందరు మాత్రం ప్లాస్టిక్ ప్రమాదకరమని భావించి.. ఆకులతో తయారు చేసిన ప్లేట్లు, పేపర్‌తో తయారు చేసిన ప్లేట్లను, గ్లాస్‌లను ఉపయోగిస్తున్నారు.

## 10 నుంచి పీజీ వరకు చదివారా..
# ఇదే చివరి ఛాన్స్

ఏపీ: నిరుద్యోగ యువత కోసం కౌశలం సర్వేను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సర్వే ఈ నెల 25తో ముగియనంది. రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా నుంచి పి.జి. వరకు ఏ విద్యార్హత కలిగి ఉన్నవారు వెంటనే మీ గ్రామ/వార్డు సచివాలయంలో విద్యార్హత సర్టిఫికేట్, ఆధార్ లింక్ మొబైల్ నెంబర్‌తో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ సర్వే ద్వారా నిరుద్యోగుల్ని గుర్తించి.. ప్రభుత్వం నుంచి నైపుణ్య అభివృద్ధి- ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్లాన్ చేసినట్లు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నివాసితులకు మాత్రమే ఈ కౌశలం సర్వే వర్తిస్తుంది. అర్హులైన వారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఈ సర్వేను ముందుగా వర్క్ ఫ్రం హోం సర్వే పేరుతో ప్రారంభించారు. ఆ తర్వాత దీనిని కౌశలం సర్వేగా మార్చారు. ఈ మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరి విద్యార్హతలు, నైపుణ్యాలు, ఉద్యోగ సన్నద్ధత వంటి వివరాలు సేకరిస్తున్నారు. సర్వేలోని డేటా ఆధారంగా ప్రభుత్వం భవిష్యత్‌లో వచ్చే ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల సమాచారం అందిస్తుంది. అర్హులైనవారికి ఇంటర్వ్యూలు, నోటిఫికేషన్లు పంపించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

నాలుగు నెలల క్రితం ఒక సర్వే నిర్వహించారు.. వర్క్‌ఫ్రంహోమ్‌కు ఇష్టపడిన వారి వివరాలను సేకరించారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వారి వివరాలు సేకరించారు. ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ చదివిన వారి పేర్లను గుర్తించి, మండలాల వారీగా గ్రామ, వార్డు సచివాలయాలకు పంపారు. వివిధ విద్యార్హతలు ఉన్నవారిని గుర్తించారు. చదువు లేని వారితో పాటు, మిగిలిన వారిని వేర్వేరుగా విభజించారు. ఇప్పుడు వారి విద్యార్హత పత్రాలను 'కౌశలం' మొబైల్ యాప్ ద్వారా పరిశీలిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది విద్యార్హత పత్రాలను పరిశీలిస్తున్నారు. సర్టిఫికెట్లను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

అర్హులైన వారికి సాంకేతిక శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యోగులు ఆధార్, మొబైల్ నంబర్, ఈ మెయిల్ ద్వారా తీసుకొని సర్వే చేస్తున్నారు. విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నారు. ఏ సంవత్సరం చదివారు, కోర్సు వివరాలు, వచ్చిన మార్కులు వంటి వివరాలను నమోదు చేస్తున్నారు. ధ్రువపత్రాలను కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అర్హులైన వారందరికీ టెక్నికల్ ట్రైనింగ్ ఇస్తారు. ఆ తర్వాత వివిధ కంపెనీలలో ఉద్యోగాలు వచ్చేలా చూస్తారు. దీని కోసం ప్రభుత్వం ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. త్వరలోనే ఈ పథకం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని భావిస్తున్నారు.

# ఉప-రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఎన్డీయేకా?



ఏపీ: జగదీప్ దనడ్ అనూహ్యంగా వైస్- ప్రెసిడెంట్ పదవి నుంచి తప్పుకోవడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీయే నుంచి మహారాష్ట్ర గవర్నర్, తమిళనాడు బీజేపీ నేత సీపీ రాధాకృష్ణన్ బరిలో ఉండగా.. విపక్ష కూటమి ఉమ్మడి అభ్యర్థిగా తెలుగు వ్యక్తి బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో తెలుగు వ్యక్తి ఏపీ, తెలంగాణకు చెందిన ప్రాంతీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ కోరింది. కానీ, ఆ పార్టీలు మాత్రం ఎన్డీయేకే జై కొట్టాయి.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఏ కూటమి అభ్యర్థికి మద్దతు అనేది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ( వైసీపీ ) తేల్చేసింది. ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కే మా మద్దతు అని ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తాజాగా వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడిన పార్టీ తమదని గుర్తుచేశారు. అయినాసరే నెంబర్ గేమ్ ఉండొద్దనే ఉద్దేశంతో 2012 రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ప్రణబ్ ముఖర్జీకి మద్దతు ఇచ్చామని ఆయన తెలిపారు. ఇప్పుడు కూడా అదే వైఖరిని అవలంభిస్తున్నామని బొత్స సత్యనారాయణ చెప్పారు. రాజ్యాంగ బద్ధమైన పదవులకు నంబర్ గేమ్ ఉండొద్దనే మద్దతు ఇస్తున్నామని, పార్టీ ఏర్పాటుచేసినప్పటి నుంచి ఇదే విధానం అవలంభిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాదు, తెలుగు అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన అభ్యర్థనపై కూడా బొత్స స్పందించారు. ఇది పరిగణలోకి తీసుకునేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే అయితే ఎన్డీయే అభ్యర్థి కూడా దక్షిణాదికి చెందిన వారే కదా? అని ఆయన ఎదురు ప్రశ్నించారు.

ప్రస్తుతం వైసీపీకి 11 మంది ఎంపీలు (నాలుగు లోక్‌సభ, రెండు రాజ్యసభ) ఉన్న సంగతి తెలిసిందే.

ఉప-రాష్ట్రపతి ఎన్నికల్లో తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్వయంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఫోన్ చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ సానుకూలంగా స్పందించింది. గతంలోనూ అనేక సందర్భాల్లో ఎన్డీయేకు వైసీపీ మద్దతు ప్రకటించింది. స్పీకర్ ఓం బిర్లా ఎన్నిక, 2017 రాష్ట్రపతి ఎన్నికల్లో రామ్‌నాథ్ కోవింద్‌కు, 2022 రాష్ట్రపతి ఎన్నికల్లో ద్రౌపది ముర్ముకు వైసీపీ మద్దతు ఇచ్చింది. అలాగే, ఢిల్లీ సర్వీసెస్, వ్యవసాయ చట్టాలు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ సహా పార్లమెంట్‌లో పలు బిల్లులకు కూడా అధికార బీజేపీ పక్షాన నిలిచింది. అంతేకాదు, 2023లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సమయంలో బీజేపీకే జగన్ మద్దతు ప్రకటించారు.

# డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరికి రూ.లక్ష..

ఏపీ: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అదిరిపోయే శుభవార్త చెప్పింది! మీ పిల్లల చదువుకు ఆర్థిక భరోసా కల్పించే ఒక కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. కేజీ నుండి పీజీ వరకు చదివే మీ పిల్లల భవిష్యత్తుకు వెలుగు నింపే అవకాశం ఇది. తక్కువ వడ్డీకే రుణం పొందండి, మీ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దండి! ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. మరిన్ని వివరాల కోసం వెంటనే వెలుగు కార్యాలయానికి వెళ్లండి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు సూపర్ న్యూస్ చెప్పింది. డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ఒక కొత్త పథకాన్ని అమలు చేస్తోంది. ఈ మేరకు జిల్లాలవారీగా మహిళలు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ పథకం ద్వారా పిల్లల చదువుకు ఆర్థిక సహాయం అందుతుంది. సెర్ప్ ఆధ్వర్యంలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా డ్వాక్రా మమ రుణాలు ఇస్తారు. ఈ పథకం కేజీ నుండి పీజీ వరకు చదివే విద్యార్థులందరికీ వర్తిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. స్త్రీనిధి నుండి తీసుకున్న రుణాన్ని పిల్లల చదువు కోసమే ఉపయోగించాలి. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయడానికి ఈ డబ్బును ఉపయోగించవచ్చు. అంతేకాకుండా సాంకేతిక విద్యకు కూడా ఈ డబ్బును ఉపయోగించవచ్చు. ఊరి నుండి దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైకిల్ కొనుక్కోవడానికి కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం ద్వారా తక్కువ వడ్డీకే ఈ రుణం తీసుకోవచ్చు.. కేవలం రూ.35 పైసల వడ్డీకే రుణం ఇస్తారు. ఒక్కో విద్యార్థికి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు అప్పు తీసుకోవచ్చు. ఎన్టీఆర్ విద్యా సంకల్పం ద్వారా స్త్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ద్వారా మహిళా సంఘాల పిల్లలకు రుణాలు ఇస్తారు. ఈ రుణాలు కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పథకానికి సంబంధించిన మరిన్ని వివరాలకు వెలుగు అధికారుల్ని సంప్రదించాలని సూచిస్తున్నారు.



ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం కింద తీసుకున్న రుణాన్ని వాయిదాలలో చెల్లించవచ్చు. కనీసం 24 నెలల నుండి గరిష్టంగా 36 నెలల వరకు గడువు ఉంటుంది. ఈ పథకం కోసం ప్రభుత్వం ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేస్తోంది. అయితే తీసుకున్న డబ్బును ఎలా ఖర్చు చేశారో బిల్లుల రూపంలో వెలుగు సిబ్బందికి ఇవ్వాలి. ఈ పథకం పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఒక మంచి అవకాశం. ఈ ఛాన్స్‌ను ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పథకం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు.



# ఎకరా ఏకంగా రూ.4 కోట్లకు, మరో కొత్త మైలురాయి

ఏపీ: రాజధాని అమరావతిలో హడ్కో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు కానుంది. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు తెలియజేశారు. 10 ఎకరాల్లో ఢిల్లీలోని హ్యాబిటేట్ సెంటర్ తరహాలో దీనిని నిర్మిస్తారు. ఇది పెట్టుబడులను ఆకర్షిస్తుందని, ఆర్థిక రంగాన్ని బలోపేతం చేస్తుందని పెమ్మసాని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరుకు చెందిన తలసేమియా వ్యాధిగ్రస్తురాలైన చిన్నారికి PMNRF నుంచి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందింది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. అమరావతిలో %ఎఖణజూ% ఒక కన్వెన్షన్ సెంటర్ నిర్మించనుంది. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని తెలుపుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆయన లేఖ రాశారు. ఎకరం రూ.4 కోట్ల చొప్పున కొని కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తుందని మంత్రి ఖట్టర్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ కన్వెన్షన్ సెంటర్ అమరావతి అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కన్వెన్షన్ సెంటర్ 10 ఎకరాల స్థలంలో ప్లాన్ చేస్తుండగా.. ఇప్పటికే 8 ఎకరాలు కేటాయించింది. ఈ విషయాన్ని పెమ్మసాని ఎక్స్ వేదికగా తెలియజేశారు.. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తుందని చెప్పారు. అలాగే ఈ హడ్కో కోసం మరో 2 ఎకరాలు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తోంది.

అమరావతిలో హడ్కో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం ఢిల్లీలోని హ్యాబిటేట్ సెంటర్ తరహాలో ఉంటుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఈ సెంటర్ వివిధ కార్యాలయాల ఏర్పాటుకు ఉపయోగపడుతుందని.. ప్రపంచస్థాయి సౌకర్యాలు ఇందులో ఉంటాయన్నారు. గృహనిర్మాణం, పట్టణాభివృద్ధిలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని.. ఇది జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఫైనాన్స్ హబ్‌గా మారుతుందన్నారు. ఈ కన్వెన్షన్ సెంటర్‌లో హాల్స్.. అతిథుల కోసం ఏర్పాట్లు, ఆహ్లాదకరంగా, వినోదాల కేంద్రంగా ఉంటుంది అన్నారు. ఇది పెట్టుబడులను ఆకర్షిస్తుందని.. ఆర్థిక రంగాన్ని బలోపేతం చేస్తుంది అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### పెమ్మసాని చొరవతో చిన్నారికి సాయం

గుంటూరుకు చెందిన ఓ చిన్నారి తలసీమియా వ్యాధితో బాధపడుతోంది. ఆ చిన్నారికి చికిత్స కోసం నుంచి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందింది. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని ఈ సహాయం వచ్చేలా చేశారు. ప్రధాని మోదీకి, పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుందని.. ఈ సాయం గొప్ప ఊరటనిస్తుంది అన్నారు. బెంగళూరులోని భగవాన్ మహావీర్ జైన్ ఆసుపత్రిలో చిన్నారి చికిత్స పొందుతోంది. చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి కేంద్రమంత్రి పెమ్మసాని ఆరా తీశారు.

# దేశంలో తొలిసారి.. ప్రతిపాదనలు రెడీ

ఏపీ: దేశంలో వాతావరణ అంచనాలు మరింత కచ్చితంగా ఉండేందుకు కేంద్రం 'మిషన్ మౌసం' ద్వారా టెస్ట్‌బెడ్‌లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో తీర ప్రాంత అధ్యయ నం కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయను న్నారు. అత్యాధునిక పరికరాల ద్వారా సేకరిం చిన సమాచారాన్ని విద్యార్థులు, పరిశోధకులు వాతావరణ పరిశోధనలకు ఉపయోగించను న్నారు. తుఫానులను ముందుగా గుర్తించేందుకు మొబైల్ రాడార్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా విపత్తుల వల్ల జరిగే నష్టాన్ని తగ్గించవచ్చు. కేంద్రం దేశంలో వాతావరణ అంచనాలు మరింత కచ్చితంగా ఉండేందుకు.. అంచనాల్లో కచ్చితత్వంపై ఫోకస్ పెట్టింది. దీని కోసం 'మిషన్ మౌసం' ద్వారా దేశంలో చాలా చోట్ల టెస్ట్‌బెడ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పుణెలోని ఐఐటీఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ) ఆధ్వర్యంలో ఈ టెస్ట్‌బెడ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఏపీలోని సాగర తీర నగరం విశాఖపట్నంలో.. తీర ప్రాంత అధ్యయనం కోసం కోస్టల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చి టెస్ట్‌బెడ్ (ఏఆర్టీ) ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. గత ఏడాది మార్చిలో మధ్యప్రదేశ్‌లోని సీహెూర్‌లో రూ.125 కోట్లతో ఏర్పాటు చేసిన టెస్ట్‌బెడ్‌ను ప్రారంభించారు.

విశాఖపట్నంలో దేశంలోనే మొదటిసారిగా వాతావరణాన్ని అంచనా వేయడానికి 30 అత్యాధునిక పరికరాలు రానున్నాయి. ఈ పరికరాలు గాలిలో ఉండే చిన్న రేణువులు (ఏరోసోల్స్), మేఘాలు, గాలులు, రేడియేషన్ వంటి వాటిని గమనిస్తాయి. ఈ సమాచారాన్ని విద్యార్థులు, పరిశోధకులు భవిష్యత్తులో పరిశోధనల కోసం ఉపయోగించుకోవచ్చు. ఈ సమాచారాన్ని భవిష్యత్తులో పరిశోధనలు చేసే విద్యార్థులకు, శాస్త్రవేత్తలకు అందిస్తారు. దీనివల్ల వాతావరణం గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది అంటున్నారు. అమెరికాలోని నోవా (నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్) సంస్థ తుఫానులు, హరికేన్లను తెలుసుకోవడానికి మొబైల్ రాడార్లను వాడుతోంది. ఇప్పుడు అలాంటి రాడార్‌ను విశాఖలో ఏర్పాటు చేయనున్నారు. ఈ రాడార్ ఉన్న వాహనం తూర్పు తీరంలో తిరుగుతూ వాతావరణాన్ని గమనిస్తుంది. తద్వారా తుఫానులు వచ్చే సమయాన్ని అంచనా వేయవచ్చు. ఈ రాడార్లను ట్రక్కుల వెనుక అమర్చుతారు.. వీటిని డాప్లర్ రాడార్లు అంటారు. విపత్తులు సంభవించే సమయంలో వాతావరణ పరిస్థితులను తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. తుఫానుల గురించి ముందుగానే తెలుసుకోవచ్చు. ప్రతి ఏటా కుండపోత వర్షాలు, వరదలు, వడగాలుల వల్ల చాలా నష్టం జరుగుతోంది. ఈ నష్టాన్ని తగ్గించుకుంటేనే ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగగలం అంటున్నారు. అందుకే ప్రభుత్వం, ఇతర సంస్థలు దీనిపై శ్రద్ధ పెడుతున్నాయంటున్నారు. దీనివల్ల నష్టాన్ని కొంతమేర తగ్గించవచ్చంటున్నారు.

# ఇంటి దగ్గరకు మాస్క్ పెట్టుకుని వచ్చి!

నెల్లూరు: జిల్లాలో బెదిరింపు లేఖ కలకలం రేపింది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఈ బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తి రూ.2 కోట్లు ఇవ్వాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించాడు. పోలీసులు కేసును సీరియస్‌గా తీసుకుని ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కూడా తన హత్యకు కుట్ర జరుగుతోందని ఆరోపించడం సంచలనంగా మారింది. ఈనెల 17న ఒక వ్యక్తి నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వచ్చాడు. అతను ముఖానికి మాస్క్ పెట్టుకున్నాడు. అక్కడ ఉన్న భద్రతా సిబ్బందికి ఒక లేఖ ఇచ్చి వెళ్ళిపోయా డు. ఆ లేఖను కార్యాలయ సిబ్బంది తీసి చూడగా.. ఆ లేఖలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనకు రూ.2 కోట్లు ఇవ్వాలి.. ఒకవేళ ఇవ్వకపోతే చంపేస్తామని రాసి ఉంది. వెంటనే సిబ్బంది అప్రమత్తమయ్యారు.. ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి విషయం చెప్పారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి బెదిరింపు లేఖ రావడాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు.. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసులో ఇస్కపాళెంకు చెందిన ఒక వ్యక్తిని అనుమానించి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వేమిరెడ్డి ఇంటి దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న మరో యువకుడిని కూడా అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారని సమాచారం. అతడి దగ్గర నాలుగు మొబైల్స్ ఉండటంతో అనుమానిస్తున్నారు. బెదిరింపు లేఖ వచ్చిన మాట వాస్తవమేనని.. అయితే దీనిపై త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. ఎలాంటి భయం అవసరం లేదన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి బెదిరింపు లేఖ రావడం నెల్లూరు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నెల్లూరు జిల్లా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కూడా తన హత్యకు కుట్ర జరుగుతోందని రెండు రోజుల క్రితం వ్యాఖ్యానించారు. తన క్వారీ దగ్గర డ్రోన్ ఎగరవేసి తన కోసం రెక్కీ చేశారని ఆయన ఆరోపించారు. కానీ తాను చివరి నిమిషంలో తన కార్యక్రమాలను మార్చుకుని అమరావతికి వెళ్లానన్నారు. ఇద్దరు యువకుల్ని తమ అనుచరులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారన్నారు. ఈ కుట్ర వెనుక మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి హస్తం ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. అయితే నెల్లూరు జిల్లాలో ఒకే సమయంలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేల ఎపిసోడ్ చర్చనీయాంశంగా మారింది.




# వారందరికి ఉచితంగా మొబైల్స్ ఇస్తున్న ప్రభుత్వం..

ఏపీ: ప్రభుత్వం బధిరులకు శుభవార్త తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన బధిరులకు టచ్ ఫోన్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ ప్రకటించింది. 18 ఏళ్లు నిండిన, ఇంటర్మీడియట్ పాసైన, సైగల భాష తెలిసిన, 40 శాతం వైకల్యం ఉన్నవారు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు లోపు ఉండాలి. ఇటు దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందించడానికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బధిరులకు (మూగ, చెవిటి)కు తీపికబురు చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారికి టచ్ ఫోన్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వి కామరాజు ఓ కీలక ప్రకటన జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 18 ఏళ్ల వయసు కలిగి, ఇంటర్మీడియట్ పాసైన (ఉత్తీర్ణత) సైగల భాష వచ్చిన వారు, 40 శాతం ఆపైన వైకల్యం గలవారు అర్హులని తెలిపారు కామరాజు.

www.apdascac.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు. ఆధార్ కార్డు, 10వ తరగతి, ఇంటర్ మార్కుల లిస్టులు, సదరం ధ్రువీకరణ పత్రం, సైగల భాష ధ్రువీకరణ, ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రాలు పంపాల్సి ఉంటుంది. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు కాపీలు కావాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దివ్యాంగ బాలబాలికలకు సహాయం చేస్తోంది. వారికి అవసరమైన పరికరాలు అందిస్తోంది. ఈ ఏడాది పరికరాలు ఇవ్వడానికి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. 18 ఏళ్ల లోపు వారికి పరీక్షలు చేసి, అర్హులైన వారికి పరికరాలు ఇస్తారు. సమగ్రశిక్ష ద్వారా ఈ పరికరాలు అందిస్తారు. దివ్యాంగుల స్క్రీనింగ్ శిబిరంలో పాల్గొనడానికి కొన్ని పత్రాలు అవసరం. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు ఉండాలి. వైకల్యం తెలిపే రెండు ఫొటోలు కూడా తీసుకురావాలి. ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి అన్ని విభాగాల్లో పరీక్షలు చేస్తున్నారు. ఈ పరీక్షలు ఈ నెల 26తో పూర్తవుతాయి.. అర్హుల జాబితాల ప్రకారం ప్రభుత్వానికి నివేదికలు పంపుతారు. ఆ తర్వాత దివ్యాంగులకు సహాయక పరికరాలు అందజేయనున్నారు. దివ్యాంగులకు మూడు చక్రాల బండ్లు, వీల్ ఛైర్లు ఇస్తారు. చంక కర్రలు, వినికిడి యంత్రాలు కూడా ఇస్తారు. కళ్లు సరిగా కనపడని వారికి ప్రత్యేక టీఎల్ఎం కిట్లు ఇస్తారు. మానసిక దివ్యాంగులకు కూడా టీఎల్ఎం కిట్లు అందజేస్తారు.

# పొదల్లోకి డ్రోన్ ఎగరేశారు.. అడ్డంగా దొరికిపోయారు...

ఏపీ: పోలీసులు టెక్నాలజీతో అదరగొడుతున్నారు. డ్రోన్లతో నేరగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో డ్రోన్ కెమెరాలతో పేకాట స్థావరాలపై నిఘా వేసి, జూదరుల ఆట కట్టించారు. లక్షల రూపాయల నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా చాలామంది పరారయ్యారు, పోలీసులు వాళ్ళ కోసం గాలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెక్నాలజీని బాగా వాడుతోంది. పోలీస్ శాఖలో డ్రోన్లను ప్రవేశపెట్టింది. డ్రగ్స్, గంజాయి సహా పలు నేరాలను అరికట్టడానికి పోలీసులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. డ్రోన్ల సహాయంతో నేరాలకు చెక్ పెడుతున్నారు. తాజాగా చిత్తూరు జిల్లాలో పోలీసులు డ్రోన్ సాయంతో ఓ గ్యాంగ్ ఆట కట్టించారు. ఏర్పేడు మండలం లోని ముసలిపేడు, కందాడ, మేర్లపాక, బండారుపల్లి, రామలింగాపురం ప్రాంతాల్లో పేకాట స్థావరాలు ఉన్నాయని గుర్తించారు. పక్కా సమాచారంతో సైబర్ టెక్నాలజీ, డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెట్టారు. స్థానిక సీఐ ఆధ్వర్యంలో పది మంది పోలీసులు డ్రోన్ కెమెరాలతో ఆ ప్రాంతాలను పరిశీలించారు. తిరుపతికి చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన ఐదుగురు, రాజంపేటకు చెందిన ఇద్దరు, కోడూరు, కలకడకు చెందిన ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,36,740 నగదు, 12 సెల్‌ఫో న్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే పారిపోయిన మరో తొమ్మిది మంది కోసం గాలిస్తున్నారు. జూదరులు తప్పించుకోకుండా పక్కాగా ప్లాన్ చేసి దాడి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక పోలీసులు డ్రోన్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడానికి ఇది ఉపయోగపడుతుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిఘా పెంచారు. దొంగతనాలు, గంజాయి వినియోగం, మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను డ్రోన్ల ద్వారా గుర్తిస్తున్నారు.

